క్లుప్తంగా

జేపీఎన్‌సీలో వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో డిఫరెంట్ గ్లోబల్ పొజిషన్ సిస్టం అంశంపై రెండో రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి చెందిన కే అండ్‌బీ కన్సల్టెన్సీ సంస్థకు చెందిన భాస్కర్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. భూసర్వే చేసే విధానాల్లో నూతనంగా వచ్చిన మార్పులు, పద్ధతులు తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కోటాల సందీప్, షానవాజ్, ఆర్గనైజర్ భరత్, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ పూర్తి చేయాలి



నవాబుపేట: ఉపాధి కూలీలకు త్వరగా ఈకేవైసీ పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఉపాధి కూలీల ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి జాబ్‌కార్డు కలిగిన కూలీని వెంటనే ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియను ఉపాధి ఫీల్డు అసిస్టెంట్లు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. రోజువారీగా టార్గెట్ ఎంచుకుని దాన్ని పూర్తి చేయాలని వివరించారు. అనంతరం మండల కేంద్రంలో నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీలపై నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఏపీఓ జ్యోతి, జంగమ్మ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబుపేట: అనుమతి లేకుండా అక్రమంగా ఇసక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మంగళవారం మండలంలోని హన్మసానిపల్లి నుంచి రుద్రారం గ్రామానికి ఎలాంటి అనుమతి లేని ట్రాక్టర్‌లో ఇసుక తరులుతుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పోలీసులను చూసి డ్రైవర్ పరారు కావడంతో ట్రాక్టర్ నంబర్ ఆధారంగా యజమాని హన్మసానిపల్లి వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'సమస్య పరిష్కరించాలి'

నవాబుపేట: గ్రామంలో వీధికి వెళ్లాల్సిన రోడ్డును తవ్వేడంతో వీధిలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు వాపోయారు. మండలంలలోని కొండాపూర్‌లో యాదవ వార్డుకు చెందిన రోడ్డును పక్కనే ఉన్న భూమి యజమాని తవ్వేశాడని గ్రామస్తులు ఆరోపించారు. భూమి తన పేరున పట్టా ఉందని.. దాంతో అతడు భూమిని చదును చేశాడని వి వరించారు. దీంతో గత కొన్ని ఏండ్ల తరబడి తాము నడుస్తూ జీవిస్తున్న వీధికి రోడ్డు క రువైందని గ్రామస్తులు ఆరోపించారు. కాగా రోడ్డు కావాలని గ్రామస్తులు కోరుతున్న స్థలంలో వీరసముద్రం చెరువుకు వరద నీరు వెళ్లే కాల్వ ఉంది. దీనిమూలంగా రోడ్డు సమస్య జఠిలంగా మారినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో తమ సమస్యను పరిష్కరించి రోడ్డు సమస్యను తీర్చాలంటూ వారు అధికారులను కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



దామరగిద్ద: మండలంలోని విటలపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శిరీష అండర్ -17 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల జీహెచ్‌ఎం నాగిరెడ్డి సమక్షంలో ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కరబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 16న జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

నవాబుపేట: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదరుచూసి. మోసపోకుమా... అన్నట్లు యువకుడు అధికారులు స్పందించి చేసేదానికంటే తామే తమ గ్రామాల ప్రజలకు మేలు చేసి ఇబ్బందులు తొలగించాలని ముందుకొచ్చి చేయూతనిచ్చిన వైనం.. ఇటీవల కురిసిన భారీవర్షానికి రోడ్డు మొత్తం కోతకు గురికాగా.. దాన్ని తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలకు సిద్ధం చేశారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గేట్ సమీపంలో భారీ వర్షానికి రోడ్డు కల్వర్టు పూర్తిగా దెబ్బతిని కనీసం నడవరాలేదు. దీంతో గ్రామానికి చెందిన జైపాల్ అనే యువకుడు తన సొంత ఖర్చుతో రోడ్డును మరమ్మతు చేయించి రాకపోకలకు సిద్ధం చేశాడు. గ్రామస్తులు, అధికారులు యువకుడి చేయూతకు అభినందించారు.



సీపీఆర్‌పై అవగాహన అవసరం



జనరల్ ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ మాధవి



మిడ్జిల్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలమూరు: గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారికి సీపీఆర్ చేయడం చాలా కీలకమని జనరల్ ఆస్పత్రి అనస్థీషియా విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నర్సింగ్, పారా మెడికల్ సిబ్బందికి సీపీఆర్ విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి సీపీఆర్ చేసే ప్రక్రియను అవగాహన కలిగించారు. మొదట అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తిని సమాంతర ప్రదేశంపై పడుకోపెట్టి, వెంటనే మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంకి సమాచారం ఇవ్వాలన్నారు. ఆ తర్వాత సదరు వ్యక్తి కుడి వైపు చూస్తు శ్వాస, పల్స్‌ని బట్టి గుండెపోటు గుర్తించాలన్నారు. గుండెపోటు కలిగితే వెంటనే చెస్ట్ కంప్రెషన్స్ మొదలుపెట్టాలి, ప్రతి నిమిషానికి 100నుంచి 120సార్లు ఐదునుంచి ఆరు సెంటిమీటర్ల లోతుకు కంప్రెషన్స్ చేయాలన్నారు. ప్రతి 30కంప్రెషన్స్‌కి



జానంపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి షబానా

ఒకసారి ఐదు నుంచి పది సెకండ్లు నోటీ ద్వారా శ్వాస ఇవ్వాలన్నారు. అందుబాటులో ఉంటే ఏఈడీ మిషన్‌ను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి పరిపాలన అధికారిని డాక్టర్ ప్రేరణ, ఆర్‌ఎంవో జరీనా, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలి

భూత్పూర్: సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెససిటేషన్)పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జానంపేట మండల వైద్యాధికారి షబానా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి అబ్దుల్ రబ్‌తో కలిసి సీపీఆర్‌పై ఏఎన్‌ఎం, ఆశ, గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ, జీపీ, మున్సిపల్, మండల పరిషత్తు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

మిడ్జిల్: ఆకస్మికంగా గుండెనొప్పి వస్తే సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించవచ్చని వైద్యాధికారి శివకాంత్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బస్టాండ్ దగ్గర సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానాన్ని ప్రయోగం ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలు దేవరకద్ర, అడ్డాకుల



బాలుర కబడ్డీ విజేత దేవరకద్ర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కార్యదర్శి శారదాబాయి



బాలికల విన్నర్ అడ్డాకుల జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగం బా ల, బాలికల కబడ్డీ టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో దేవరకద్ర ప్రథమ, మహ్మదాబాద్ ద్వితీయ, బాలికల విభాగంలో అడ్డాకుల జట్టు ప్రథమ, మహ్మదాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి నేడు (బుధవారం) గద్వాల జిల్లా మద్దూర్‌లో అండర్-14 ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ఉంటుందని తెలిపారు. అనంతరం విజేత జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్, పీడీలు వేణుగోపాల్, రామ్‌కల్యాణ్, రాంచందర్, రమేశ్‌బాబు, రాజవర్ధన్‌రెడ్డి, రవినాయక్, శంకర్ నాయక్, మేరి పుష్ప పాల్గొన్నారు.

జిల్లా చెస్ ఎంపికలు

మెయిన్ స్టేడియంలో మంగళవారం అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి బాల, బాలికల చెస్ ఎంపికలు నిర్వహించారు. ప్రతి విభాగం నుంచి ఐదుగురు క్రీడాకారులను ఉమ్మడి జిల్లాకు ఎంపిక చేయడం జరిగిందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి తెలిపారు.

బస్‌షెల్టర్ లేక అవస్థలు



పొన్నకల్ స్టేజీ వద్ద రోడ్డుపై నిలుచున్న విద్యార్థులు, ప్రయాణికులు

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై పొన్నకల్ స్టేజీ వద్ద కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డుపై బస్‌షెల్టర్ నిర్మించినా కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై బస్‌షెల్టర్ లేదు. దీనివల్ల పొన్నకల్, రాచాల, నందిపేట, నాగాయపల్లి, జీనగరాల, దోకూర్ ప్రయాణికులు కర్నూల్, హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఇక్కడికే వస్తారు. ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రధాన రోడ్డుపైనే ప్రయాణికులు ప్రమాదభరితంగా వాహనాల కోసం వేచి ఉంటున్నారు. కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై వాహనాలు అదుపు తప్పితే ప్రయాణికులపైకి దూసుకెళ్లే అవకాశం ఉన్నా అక్కడే నిలబడుతున్నారు. వర్షాకాలం, వేసవిలో బస్సులు, ఆటోల కోసం ఎండలోనే నిలబడుతున్నారు. దీనివల్ల ఎండకు, వానకు తడవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. రహదారి నిర్వాహకులు స్పందించి ఇక్కడ బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. మరోవైపు హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డు పక్కన నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. దాంట్లో నిలబడటానికి ప్రయాణికులు భయపడుతున్నారు. దాన్ని బాగు చేయించాల్సిన అవసరముంది.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మరికల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సూర్యచంద్ర ఫౌండేషన్ తరఫున మొదటి బహుమతిగా రూ.3016, రెండో బహుమతి రూ.2016 అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కరీముల్లా, జీహెచ్‌ఎం నాగరత్నమ్మ, యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, హరీష్, చెన్నయ్య, రఘుపతిరెడ్డిలు పాల్గొన్నారు.



రైతు సంక్షేమానికి పెద్దపీట



దివిటిపల్లిలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత

మహబూబ్‌నగర్ రూరల్: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత అన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని దివిటిపల్లి రైతువేదికలో జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకం కింద సుమారు 50మంది రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రూ.2లక్షలలోపు రైతులకు సంబంధించిన రుణాలను ఏకకాలంలో మాఫీ చేసి రైతులకు ప్రభుత్వం రుణ విముక్తి కల్పించిందని గుర్తుచేశారు. ప్రతిసారి ఒకే రకమైన పంటలను సాగు చేయకుండా వాణిజ్య పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపించాలని సూచించారు. వరి, పత్తి కన్నా పప్పు దినుసుల సాగులో అధిక లాభాలు ఉంటాయని, పెట్టుబడి సైతం తక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రాంపాల్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, ఏఈఓలు సునీత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం గుర్తింపు పత్రం జారీ



లింగనపల్లి మత్స్యకారులకు గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధికారి రాధారోహిణి

మహబూబ్ నగర్ న్యూటౌన్: హన్వాడ మండలం లింగన్నపల్లి పరిధిలో నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నుంచి గుర్తింపు పత్రాన్ని అందజేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి రాధారోహిణి లింగనపల్లి గ్రామ మత్స్యకారులకు గుర్తింపు పత్రాన్ని అందజేసి ఇకపై లింగన్నపల్లి ప్రత్యేక సంఘంగా గుర్తించబడిందని, భవిష్యత్‌లో మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే కార్యక్రమాలను సంఘం పరిధిలోనే అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి గంజి ఆంజనేయులు మాట్లాడుతూ.. లింగనపల్లిలో 15 మంది సభ్యులతో నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గుర్తింపు పత్రాన్ని జారీ చేసిందని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి నూతనంగా ఏర్పాటైన సంఘం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మాజీ ఉపసర్పంచ్ వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై నిలిచిన ట్రాఫిక్



మూసాపేట స్టేజీ వద్ద కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై నిలిచిన వాహనాలు



నిలిచిన వాహనాల మధ్య నుంచి రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనదారులు

- మూసాపేట వద్ద రాకపోకలకు ఇబ్బందులు

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల స్టేజీ నుంచి మూసాపేట స్టేజీ దాటి మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచి పోయింది. వేముల స్టేజీ వద్ద అండర్ బ్రిడ్జి పనులు జరుగుతున్న నేపథ్యంలో కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇక్కడ ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనాలను సర్వీస్ రోడ్డుపైకి మళ్లించారు. దానిపై వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతోపాటు బ్రిడ్జి నిర్మాణం కోసం మట్టిని తరలించే వాహనాలు కర్నూల్ రోడ్డును దాటుతున్న క్రమంలో వాహనాలు చాలా నెమ్మదిగా వెళ్తున్నాయి. దీనివల్ల మూసాపేట స్టేజీ దాటి వాహనాలు నిలుస్తున్నాయి. అయితే కొత్తకోట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు మూసాపేట బస్టాండ్‌లోకి వెళ్లేందుకు హైవేను దాటి వెళ్లాల్సి ఉంది. ఇక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో బస్సుల డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతోపాటు మంగళవారం మూసాపేటలో జరిగే వారాంతపు కూరగాయల సంతకు వచ్చి వెళ్లే ఆటోలు, ద్విచక్రవాహనదారులు హైవేను దాటాల్సి రావడంతో ట్రాఫిక్ నిలిచినప్పుడు సమస్యను ఎదుర్కొంటున్నారు. రహదారిపై నిలిచిన వాహనాల మధ్య నుంచి ప్రమాదకరంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు వేగంగా హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డుపైకి వెళ్తున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో సంత జరిగే మంగళవారం ఇక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలు రోడ్డు దాటేందుకు ట్రాఫిక్‌ను నియంత్రించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

ఇంత.. నిర్లక్ష్యమేలా..?

- భూత్పూర్–చించోలి హైవేపైనే ఆటలు
- విద్యార్థినుల ప్రాణాలతో ఉపాధ్యాయుల చెలగాటం
- వేగంగా వస్తున్న వాహనాలు, ప్రమాదాలకు అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల పరిధిలోని గురుకులాల్లో చిన్నచిన్న తప్పిదాలకు విద్యార్థులు ప్రాణాలు సైతం పోతున్న ఘటనలు ఇటీవల అనేకం జరుగుతుఉన్నాయి. అధికారులకు అన్ని తెలిసి హైవే రోడ్డుపై విద్యార్థులను ఆటలు ఆడిస్తే అది విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారనుంది. ఇందుకు సాక్ష్యంగా జిల్లా కేంద్రంలోని భగీరథకాలనీ వద్ద ఉన్న జేపీఎన్‌ఈసీ కళాశాల భవనంలో కొనసాగుతున్న మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో హైవే రోడ్డుపైనే ఆటలు ఆడిస్తున్నారు. భూత్పూర్–చించోలి నేషనల్ హైవే పనులు దాదాపు 80శాతానికి పైగా పూర్తయ్యాయి. దీంతో చాలా వాహనాలు అతివేగంతో హైవే రోడ్డుపైనే ప్రయాణం కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో మైనార్టీ రెసిడెన్షియల్ విద్యార్థులను వాహనాలు వెళ్తున్నప్పటికీ అధికారులు రోడ్డుపై ఆటలు ఆడించడం ఎంత ప్రమాదకరమని తెలిసినా విద్యార్థులతో ఆటలు ఆడిస్తున్నారు. రోడ్డుపై ఆటలు ఆడొద్దని చెప్పే ఉపాధ్యాయులే ఆటలు ఆడిస్తే జరగరాని ప్రమాదం జరిగి, విద్యార్థులకు ప్రమాదం జరిగితే దాని ఖరీదు ఎంత అనే ప్రశ్న తలెత్తుతుంది. విద్యార్థులకు ఆడుకునేందుకు సరైన క్రీడాప్రాంగణం లేకపోయినప్పటికీ రోడ్డు మీద ఆడించడం చాలా ప్రమాదమని అటూగా వెళ్తున్న వాహనదారులు పేర్కొంటున్నారు.



నేషనల్ హైవే మీద ఆటలు ఆడుతున్న విద్యార్థులు, పక్కన వెళ్తున్న మినీ ట్రక్

అండర్‌పాస్ నిర్మించాలని వినతి



రైల్వే డిప్యూటీ మేనేజర్ ఉదయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: దేవరకద్ర పటణంలోని రేల్వే గేట్‌వద్ద అండర్పాస్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌ని కోరారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో రైల్వే డిప్యూటీ మేనేజర్‌ను కలిసి అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవరకద్ర పట్టణంలో గత పాలకులు అనాలోచనతో వంతెన నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఈ బిడ్జి నిర్మాణంతో దేవరకద్ర పట్టణం రెండు భాగాలుగా విడిపోయిందన్నారు. దీంతో అవతలికి ఇవతలికి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అందుకు రైల్వేగేట్ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీటీడీ బోర్డు మెంబర్ మన్నె జీవన్‌రెడ్డితోపాటు పలువురు ఉన్నారు.

వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మధుసూదన్‌గౌడ్
- నేటినుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): పాడిరైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో పశువైద్య, పశుసంవర్ధకశాఖ ద్వారా జిల్లాలోని ఆవులు, గేదెలకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మధుసూదన్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం తన చాంబర్‌లో పశువైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. నేటి నుంచి నవంబర్ 14వ తేదీ వరకు జిల్లాలోని 423 గ్రామాలలో ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని పశువైద్య సిబ్బందిని 52 బృందాలుగా ఏర్పాటు చేయడం జరిగిందని, నెల రోజులపాటు క్షేత్ర స్థాయిలో అన్ని పశువులకు టీకాలు ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలోని 82వేల గోజాతి పశువులు, 74వేల గేదె జాతి పశువులకు ఉచిత టీకాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా టీకాలు వేసిన పశువు, రైతు వివరాలు భారత్ పశుధన్ అనే దరఖాస్తు ద్వారా కంప్యూటర్‌లో నమోదు చేయడం జరుగుతుందని వెల్లడించారు. జిల్లాలో పశువులు కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీకాల పంపిణీకి ఏర్పాట్లు

మిడ్జిల్: మండలంలోని పశువులకు ఈనెల 15 బుధవారం నుంచి పశువులు, గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పశువైద్యాధికారి శివరాజ్ తెలిపారు. మండలంలో నెల రోజులపాటు ఉచిత టీకాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని పశువుల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

భూత్పూర్: పశువులకు గాలికుంటు వ్యాధులు సోకకుండా టీకాలు ఇవ్వనున్నట్లు మంగళవారం మండల పశువైద్యాధికారి మధుసూదన్ తెలిపారు. 4నెలలు దాటిన పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నట్లు 15వ తేదీనుంచి నవంబరు 13వ తేదీ వరకు నెలరోజులపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్

జడ్చర్ల: మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌పై స్థానిక ఎమ్మె ల్యే అనిరుధ్‌రెడ్డి పలు ఆరోపణలు చేయడం ఎంతమాత్రం సహేతుకం కాదని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పేర్కొన్నారు. ఎర్రశేఖర్ బీసీ నేత కావడం చేతనే అగ్రకుల నేత అనిరుధ్‌రెడ్డి టార్గెట్ చేశారని మండిపడ్డారు. స్థానిక అంబేడ్కర్ కళాభవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్ర శేఖర్‌పై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకుని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తమ నేత ఇసుక మాఫియా, రియల్ మాఫీయాకు దూరంగా ఉన్నారని, పేదల భూములు కూడా ఎక్కడా లాక్కోలేదని, ప్రజలను కూడా ఎక్కడా భయభ్రాంతులకు గురిచేయలేదన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేశారని కొనియాడారు. అజాతశత్రువుగా పేరొందిన తమ నేతను పాక్షనిస్టుగా చిత్రీకరించడం సమంజసం కాదన్నారు. క్షమాపణలు చెప్పకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని తెలిపారు. సమావేశంలో నాయకులు చారి, శేఖర్, శ్రీనివాస్, నిరంజన్, నర్సింహులు, అనిల్, వెంకటేశ్, పరుశవేది పాల్గొన్నారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై బీసీసమాజ్ ఖండన

జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ను తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకుంటున్నారన్న సమాచారంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్‌సాగర్ ఒక ప్రకటనలలో పేర్కొన్నారు.

గందరగోళంగా చికెన్ వ్యర్థాల తరలింపు

- ఎమ్మెల్యే సోదరుడు డబ్బులు అడిగారని ఆరోపణలు
- నిజనిరూపణకు మున్సిపాలిటీకి వచ్చిన దుష్యంత్‌రెడ్డి



జడ్చర్ల మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పుష్పలతతో సమావేశమైన దుష్యంత్‌రెడ్డి

జడ్చర్ల: మున్సిపాలిటీలో చికెన్ వ్యర్థాల వేలం, తరలింపు వ్యవహారం గందరగోళంగా తయారైంది. చికెన్ వ్యర్థాల టెండర్‌ను దక్కించుకున్న వ్యక్తిని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరుడు దుష్యంత్‌రెడ్డి డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం, వాటిపై నిజనిజాలు తేల్చేందుకు ఆయనే స్వయంగా మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకుని దీనిపై విచారించారు. చికెన్ వ్యర్థాల తరలింపునకు బహిరంగ వేలం వేయగా.. గద్వాల ప్రాంతానికి చెందిన పరశురామ్ రూ.20.60లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. తదుపరి నిబంధనల మేరకు టెండర్‌దారుడికి మున్సిపాలిటీకి మధ్య ఒప్పందం కుదుర్చుకుని ముందుకు సాగాల్సి ఉండగా.. ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే సోదరుడు దుష్యంత్‌రెడ్డి ఆకస్మికంగా జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకుని ఈ వ్యవహారంలో తలదూర్చడంతో చర్చనీయాంశంగా మారింది. టెండర్‌దారుడు పరశురాం తన దగ్గరకు వచ్చి రూ.3లక్షలు ఇస్తాను చికెన్ వ్యర్థాల తరలింపునకు సహకరించాలని కోరడంతో తాను మందలించి పంపానని, అయితే సోషల్ మీడియాలో తానే రూ.3లక్షలు డిమాండ్ చేసినట్లు రావడంతో స్పందించి నిజనిరూపణకు వచ్చానని వివరించారు. టెండర్‌దారుడు తన దగ్గరకు ఎందుకు వచ్చాడో అర్థం కావడం లేదన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పుష్పలత, అధికారుల ఎదుట అతను విషయాన్ని చెప్పాడని పేర్కొన్నారు. చికెన్ వ్యర్థాల తరలింపు వెనుక పెద్ద మాఫియా నడుస్తుందని, అటు మహబూబ్‌నగర్ ఇటు జడ్చర్లలో ఈ వ్యవహారం మున్సిపాలిటీ ఆదాయాలకు గండి కొట్టే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చేపల ఫీడ్ పరిశ్రమలకు తరలించాల్సిన వ్యర్థాలను నేరుగా చేపల చెరువులకు విక్రయిస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తన సోదరుడు చేస్తున్న అభివృద్ధి పనులను జీర్ణించుకోలేక కొందరు ఇలాంటి చౌకబారు కుట్రలకు తెరలేపుతున్నారని, తనకు సంబంధంలేని వ్యవహారాలను అంటగడుతున్నారని తెలిపారు.